క్లుప్తంగా

రోడ్డు మరమ్మతు పనులు పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, నాయకులు

రాయికల్: పట్టణంలోని రామాజీపేట బ్రిడ్జి వద్ద చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి పరిశీలించారు. వర్షాకాలంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అభివృద్ధి నిధుల నుంచి తాత్కాలికంగా రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు. వీరి వెంట కమిషనర్ చిరంజీవి, ఏఈ ప్రసాద్ ఉన్నారు.

డీఎస్పీని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



డీఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

జగిత్యాలక్రైం: ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జగిత్యాల సబ్‌డివిజన్‌లో పలు సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, సురుగు శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బోనగిరి కిషన్, జిల్లా ప్రచార కార్యదర్శి కొల్లూరి సురేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క సతీశ్, పోడేటి సునీల్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి మృతి బాధాకరం



గురుకుల సిబ్బందితో మాట్లాడుతున్న కరం

మెట్‌పల్లిరూరల్: పెద్దాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థి గణాదిత్య మృతి చెందడం, గణేశ్,హర్షవర్ధన్‌లు అస్వస్థతకు గురికావడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సుప్రీం కోర్టు అడ్వకేట్ కొమిరెడ్డి కరం అన్నారు. సోమవారం గురుకులాన్ని సందర్శించిన ఆయన ఘటనకు సంబంధించిన విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడారు.మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా వచ్చేలా చూడాలని కోరారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆస్పత్రి డైరెక్టర్‌కు ఫోన్ చేసి తెలుసుకున్నారు.కార్యక్రమంలో నాయకులు విజయ్‌అజాద్,అశోక్,రయిస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు చెరువుల్లో చేపలు పట్టవద్దు



పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై నరేశ్‌కుమార్

మల్యాల: పిల్లలు చెరువుల్లో చేపలు పట్టవద్దని మల్యాల ఎస్సై చెరువులో చేపలు పడుతున్న పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం మల్యాల మండలం సూరప్ప చెరువులో మైనర్లు చేపలు పడుతున్నారనే విషయం తెలుసుకుని, చెరువు వద్దకు వెళ్లి, పిల్లలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చెరువులో చేపట్టేందుకు వెళ్లే ప్రాణాలు కోల్పేయే ప్రమాదం ఉందని, పిల్లలు చెరువుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు నిఘా పెట్టాలని, చెరువుల్లో ఈతకు వెళ్లి, ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్ అన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన రాచర్ల మధుశ్రీకి కిడ్నీలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యం కోసం ఎల్‌వోసీ రూ. 1.50 లక్షలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ నాయకులు పులి హరిప్రసాద్, జవ్వాజి చౌదరి సోమవారం తెలిపారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దూర భారం | 8 కిలో మీటర్లు

- వంతెన నిర్మాణం ఇంకెన్నాళ్లు..
- వాగులో తరచూ కొట్టుకు పోతున్న తాత్కాలిక దారి
- కోరుట్ల, సంగెం,నాగులపేట, యెఖిన్‌పూర్ వాసులకు తిప్పలు



సంగెం-యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య అసంపూర్తిగా వంతెన

కోరుట్ల రూరల్: వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామాల ప్రజలు పనులకు వెళ్లాలన్నా, వేరే గ్రామాలకు వెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నారు. కోరుట్ల మండలంలోని సంగెం, నాగులపేట వాసులు కోరుట్లకు వెళ్లాలన్నా.. కోరుట్ల రైతులు పెద్దవాగు దాటి సంగెం శివారు వ్యవసాయ భూముల్లోకి వెళ్లాలన్నా.. సంగె-యెఖీన్‌పూర్ మధ్య రాకపోకలు జరగాలన్నా 8 కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సిందే.. ఈ నాలుగు గ్రామాలు కను చూపు మేరలో సుమారు 1.5 కిలో మీటర్ల దూరంలోనే ఉన్నప్పటికీ వర్షాకాలంలో పెద్ద వాగు ప్రవాహం ఈ గ్రామాల మధ్య సుమారు 8 కిలో మీటర్ల దూరం పెంచుతుంది. ప్రతీ ఏడాది ఆ గ్రామాల ప్రజలు ప్రయాణ భారం తగ్గించుకునేందుకు వాగులో తాత్కాలిక దారి నిర్మించుకోవటం.. వర్షాకాలంలో ఆ దారి కొట్టుకుపోవటం జరుగుతోంది..ప్రయాణికుల అవస్థలు గుర్తించిన అప్పటి పాలకులు పెద్ద వాగుపై సంగెం -యెఖీన్‌పూర్, కోరుట్ల-సంగెం మధ్య వంతెనలకు నిధులు మంజూరు చేయించారు. కానీ 8 ఏళ్లుగా వంతెనల పనులు నత్త నడకగా కొనసాగుతూ ఇప్పటికీ అసంపూర్తిగానే ఉండటంతో ప్రయాణికులకు తిప్పలు తప్పటం లేదు.



కోరుట్ల-సంగెం మధ్య పిల్లర్ల దశలోనే నిలిచిన వంతెన పనులు

వంతెనలకు నిధులు మంజూరు

మండలంలోని సంగెం-యెఖీన్‌పూర్ గ్రామాల మధ్య పెద్ద వాగుపై వంతెన, చెక్ డ్యామ్ నిర్మాణం కోసం, 2016లో నాబార్డు నిధులు రూ. 4.12 కోట్లు, కోరుట్ల-సంగెం గ్రామాల మధ్య చెక్ డ్యాం, వంతెన నిర్మాణం కోసం రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు నత్త నడకగా పనులు కొనసాగించటంతో కొంతమేర పని చేసి, నిర్మాణ వ్యయం పెరిగిందని మధ్యలోనే వదిలేశారు. మిగిలి ఉన్న పనులు పూర్తి చేయటానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం మారటంతో నిధులు క్యాన్సల్ అధికారులు పేర్కొంటున్నారు.

వంతెనలు పూర్తయితే 1.5 కిలో మీటర్లే..

కోరుట్ల పట్టణానికి సంగెం, నాగులపేట, కథలాపూర్ మండలాంలోని తక్కళ్లపల్లి, బొమ్మెన గ్రామాల ప్రయాణికులు, కోరుట్ల రైతులు పొలాలకు వెళ్లేందుకు పెద్ద వాగు దారినే ఎక్కువ వినియోగిస్తారు.ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రెండు బ్రిడ్జీ పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వాగు ఒడ్డునే పొలం ఉంది



మా పొలాలన్నీ పెద్దవాగు ఒడ్డున కూతవేటు దూరంలోనే ఉన్నాయి. వర్షాకాలం వాగు పొంగి ప్రవహించటంతో వాగు నుంచి దారి కోసుకపోయింది. కోరుట్ల నుంచి సంగెం మీదుగా మళ్లీ వాగొడ్డుకు తిరిగి రావాల్సి వస్తుంది. మా ముస్లిం ఖబరస్తాన్ కూడా వాగు ఒడ్డునే ఉంది. ఎవరైనా చనిపోతే 8 కిలో మీటర్లు తిరిగి చేరుకోవాలి బ్రిడ్జి పనులు పూర్తి చేయించాలి.

– మతీన్ రైతు, కోరుట్ల

కూరగాయలమ్మేందుకు తిరిగి వెళ్లాలి



సంగెం నుంచి ప్రతీ రోజు కూరగాయలమ్మేందుకు వర్షాకాలంలో 8 కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. మార్కెట్ సంగెంకు దగ్గరగానే ఉంది, కానీ వాగులో దారి ప్రతీ ఏటా కోతకు గురవుతుంది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. వంతెన పనులు పూర్తి చేస్తే దూరం తగ్గుతుంది. పాలకులు పట్టించుకోవాలి.

– గోపిడి రాములు, సంగెం

ప్రతిపాదనలు పంపించాం



ఏడాదిన్నర క్రితమే ప్రతిపాదనలు పంపించాం. సంగెం -యెఖీన్‌పూర్ వంతెనకు రూ. 1.50కోట్లు, కోరుట్ల-సంగెం వంతెనకు రూ.3.60కోట్లు ప్రతిపాదనలు చేసి పంపించాం. మంజూరులో జాప్యం జరిగి పనులు ప్రారంభం కాలేదు. ఈ లోగా ఎన్నికలు వచ్చాయి. పనులు ప్రారంభం కాలేదు. నిధులు కూడా మంజూరు కాలేదు.

– గోపాల్ డీఈ, పంచాయితీరాజ్

గుంతల రోడ్డుపై ప్రయాణమెలా?



గుంతలు పడిన ఏడో నెంబర్ రాష్ట్ర రహదారి

వెల్గటూర్: మండల కేంద్రంలో పెద్ద వాగుపైన 7వ నెంబర్ రాష్ట్ర రహదారిపై నూతనంగా నిర్మించిన హైలెవల్ వంతెనకు ఇరు వైపులా పెద్ద పెద్ద గుంతలు పడి ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెల్గటూర్ పెద్ద వాగులో కాళేశ్వరం లింక్-2 ప్రాజెక్టులో భాగంగా నిత్యం భారీ వాహనాలు, వెలటూర్-జగదేవుపేట గ్రామాల మధ్య ఉన్న క్రషర్ల నుంచి ప్రతీరోజు అధిక లోడ్‌తో నిత్యం వందల సంఖ్యలో టిప్పర్ లారీలు తిరుగుతుండడంతో రోడ్డంతా ధ్వంసమై గుంతల మయమైంది. నిత్యం వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, లారీలు నడిచే రాష్ట్ర రహదారి గుంతల మయంగా మారడంతో నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం కావడంతో రోడ్డుపై ఉన్న పెద్ద పెద్ద గుంతల్లో నీరు నిలిచి గుంతలు గుర్తించలేక అనేక ప్రమాదాలు జరిగాయి. అలాగే రాత్రి వేళల్లో వచ్చే వాహనదారులకు గుంతలు కనబడక ఎన్నో ప్రమాదాలు సంభవించాయి. ఇటీవల రాత్రి సమయంలో ఓ కారులో ప్రయాణిస్తున్న వారు గుంతలు తప్పించబోయి రోడ్డు పక్కన విద్యుత్ పోల్‌ను ఢీకొట్టారు. కారు పూర్తిగా ధ్వంసమైనా ప్రాణా పాయం తప్పింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేయించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ వంతెనపై ప్రమాదకరంగా గుంతలు



వంతెనపై ప్రమాదకరంగా గుంతలు

మల్యాల: మండలంలోని తాటిపల్లి నుంచి లంబాడిపల్లి వెళ్లే దారిలో ఎస్సారెస్పీ కాలువపై వంతెనపై ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లలేనంత ఇరుకుగా ఉంది. వంతెన నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. ఆరు నెలల క్రితమే వంతెన మరమ్మతు చేపట్టగా, నాసిరకం పనులతో వంతెనపై గుంతలు ఏర్పడడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, మరమ్మతు పనులు చేపట్టి, గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రతి కార్మికుడి హాజరు నమోదు తప్పనిసరి



హాజరుశాతాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ప్రతి కార్మికుడి హాజరు నమోదు తప్పనిసరి అని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం శానిటేషన్ సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలించి మాట్లాడారు. పారిశుధ్యం మెరుగుపర్చాలని, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆమె వెంట కమిషనర్ సమ్మయ్య, వివిధ శాఖల అధికారులున్నారు.

నేడు ప్రజాదర్బార్

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి తెలిపారు. ప్రజలు సమస్యలు నేరుగా వచ్చి చెప్పుకోవచ్చని, వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఎర్రోజు చంద్రమౌళి పదవీ విరమణ పొందగా ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా కేంద్రంలోని వీకేబీ ఫంక్షన్‌హాల్‌లో ఉపాధ్యాయ సంఘం నాయకులు చంద్రమౌళి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో గాయత్రి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం రాంరెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్, భీమయ్య, సారంగాపూర్ ఎంఈవో మురళీమోహన్, డీసీఈబీ కార్యదర్శి నరేందర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు..

సాక్షి స్పందన



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏఈ, సిబ్బంది, రైతులు

మల్లాపూర్: 'విద్యుత్ అధికారులు.. కరుణించరూ' శీర్షికన ఈ నెల 28న సాక్షిలో ప్రచురించిన కథనానికి ట్రాన్స్‌కో ఎన్పీడీసీఎల్ అధికారులు స్పందించారు. మల్లాపూర్ ఏడీఈ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు ఏఈ వినీత్‌రెడ్డి నేతృత్వంలో విద్యుత్‌శాఖ సిబ్బంది సోమవారం మల్లాపూర్ మండలంలోని గొర్రెపల్లి శివారులో పాడైన ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి కొత్తది అమర్చి పంటపొలాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో తమ సమస్యకు సకాలంలో స్పందించిన ట్రాన్స్‌కో ఏడీఈ శీనివాస్‌రావు, ఏఈ వినీత్‌రెడ్డి, సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి



రాయికల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయికల్: ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు దొబ్బల వేణుగోపాల్ అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలో ఎమ్మార్పీఎస్‌జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామాల్లో జెండా గద్దెలు నిర్మించి జెండా ఆవిష్కరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాపురపు నర్సయ్య, పాలెపు బాలరాజు, నర్సింహ, శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు.

నేడు రైతులకు పంట కలుపు నివారణపై శిక్షణ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతులకు పంటలు కలుపు నివారణపై శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణను ఇవ్వనున్నట్లు ఏవో దీపిక సోమవారం తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: మండలంలో బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతలుగా పేరున్న వల్లంపల్లి మాజీ సర్పంచ్ వెల్మ సమత-నవీన్‌రెడ్డి, భీమారం పీఏసీఎస్ చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, కాచారం మాజీ సర్పంచ్ కొప్పుర జెలందర్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు సోమవారం హైదారాబాద్ అసెంబ్లీ ఆవరణలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మేడిపల్లి,భీమారం మండలాల అధ్యక్షులు ఏనుగు రమేశ్ రెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగారాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

జగిత్యాల: రైతుల కోసం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్సీ రమణ చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డిని కోరారు. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల నాయకులు ఎమ్మెల్సీని కోరగా, వెంటనే నీటిని విడుదల చేయాలని చీఫ్ ఇంజనీర్‌ను ఫోన్లో కోరారు. వెంటనే స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీలు రమణ, సొల్ల భీమన్న, సత్యంరావు ఉన్నారు.

డీ-53 ప్రధాన కాలువకు ..

సారంగాపూర్:డీ-53 ప్రధాన కాలువకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ అన్నారు. సోమవారం ఆయన బీర్‌పూర్‌లో మాట్లాడారు. ఎస్సారెస్పీ భారీగా ఇన్‌ఫ్లో వస్తున్నందునా వెంటనే నీటిని విడుదల చేయాలని, వరి నాట్లకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఆయన వెంట విండో మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, నాయకులు ఉన్నారు.

రాయికల్‌లో సీఐ విచారణ



షాప్ వద్ద విచారిస్తున్న సీఐ

రాయికల్: పట్టణంలోని లక్ష్మీనరసింహ జ్యువెలరీ దుకాణంలో ఇటీవల దొంగతనం జరుగగా, సోమవారం జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి సంఘటన స్థలంలో విచారణ చేపట్టారు. బాధితుడు ఉరుమల్ల ప్రసాద్ 6 తులాల బంగారం , 25 వేల నగదు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి దొంగిలించినట్లు తెలిపారు.

కాకతీయ కాలువకు..

ఇబ్రహీంపట్నం: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కాకతీయ కాలువ కింద ఉన్న ఆయకట్టు పొలాల్లో నాట్లు వేసే దశలో వచ్చినందున నీళ్లు లేక నాట్లు వేయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీలో సోమవారం వరకు 1075 అడుగల నీళ్లు ఉన్నందునా కనీసం వారబందు పద్ధతిలో కాకతీయ కాలువకు నీటిని విడుదల చేస్తే పొలాల్లో నాట్లు వేసుకుంటామని రైతులు తెలిపారు.

రోడ్డుపైనే కట్టెల మండి..



రోడ్డుపైనే ఉన్న కట్టెల మండి

కోరుట్ల రూరల్: కోరుట్ల శివారు జాతీయ రహదారి నుంచి సంగెం గ్రామానికి వెళ్లే రోడ్డు పై కట్టె గిన్ని వద్ద రోడ్డుపైనే కట్టెల మండి పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురెదురు వాహనాలు వచ్చినపుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కట్టెల మండి తొలగింపజేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మటన్ మార్కెట్ బురదమయం..



బురదమయమైన మటన్‌మార్కెట్

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మటన్ మార్కెట్‌లో చినుకుపడితే చాలు బురదమయమై గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. బురదతో నిండి ఉండటం వల్ల మటన్ కొనుగోలు చేసేందుకు వెళ్లే వారు జారిపడుతున్నారు. అలాగే మార్కెట్ లోపల పిచ్చి చెట్లతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పనికి రాని వస్తువులను అక్కడే పారేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి మటన్ మార్కెట్ లోపల పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి వర్షం పడితే బురద కాకుండా శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోనాపూర్‌లో వైద్యశిబిరం

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్‌లో సోమవారం వైద్యాధికారి డాక్టర్ శివకుమారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు జ్వరాలపై పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పెంబట్ల గ్రామంలో జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రత పాటించి దోమల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పూర్ణచందర్

జగిత్యాల: పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఇటీవల బదిలీలు జరిగాయి. కోరుట్ల మండలం పైడిమడుగులో పశుసంపద అధికారిగా పనిచేస్తున్న పూర్ణచందర్ పొలాసకు బదిలీపైగా రాగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

జ్వరాలపై జాగ్రత్తగా ఉండాలి

జగిత్యాల: జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో జ్వరాలు అత్యధికంగా ప్రబలుతాయని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వస్తుందని, చలితో కూడిన జ్వరం వస్తుందన్నారు. ఎడిస్ ఈజిప్ట్ ఆడదోమ ద్వార డెంగీ వస్తుందని చెప్పారు. క్యూలెక్స్ ఆడదోమ కుట్టడం వల్ల మెదడువాపు వ్యాధి వస్తుందని, 14 ఏళ్లలోపు పిల్లలకే ఈ వ్యాధి వస్తుందని జాగ్రత్తగా ఉండాలన్నారు. క్యూలెక్స్ దోమ వల్ల ఫైలేరియా వ్యాప్తి చెందుతుందని, జ్ఞానేంద్రియాలు పాడుతాయని తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

రాయికల్: మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న నారాయణ భార్య సోమవారం మృతి చెందగా మున్సిపల్ చైర్మన్ మోరహన్మండ్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు మహేశ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాకారుల అవగాహన

మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేటలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, నీటి పొదుపు, ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తమ ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు వేములవాడ మహిపాల్, మల్లిక్ తేజ ,పలిగిరి రాజేందర్ ,పంచిరి ప్రవీణ్, అశోక్, పంబాల రమేశ్, భోగే అశోక్, సురేష్ నాయక్, పాల్గొన్నారు

పాఠశాలలో బోనాల వేడుకలు



బోనాల వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కథలాపూర్: మండలకేంద్రంలోని కిడ్జీ ఎలైట్ పాఠశాలలో సోమవారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో బోనాల పండుగ ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేయాలని ఈ వేడుకలు నిర్వహించినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మోర్తాడు ఉదయ్, అకడమిక్ కో ఆర్డినేటర్ ఉమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మేడిపల్లి: మండలంలో సోమవారం సాయంత్రం కమ్ముకున్న కారుమబ్బులకు ఆకాశంలో జంట సింగిడీలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పచ్చని పొలాలు, పైన కారుమబ్బులతో జంట ఇంద్ర ధనుస్సులను చూసి ఆనందించారు.